కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ ఖాయం

నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాదిగ దండోర రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు జంగయ్య, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు జాన్, ప్రధాన కార్యదర్శి గుండ్ల శ్రీనివాస్, నాయకులు శోభ, సరస్వతీలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ 10 ఏళ్ళ బీఆర్ఎస్ పాలనలో శేరిలింగంపల్లి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాలనీలు, బస్తీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి, నాయకులు బాలింగ్ యాదగిరిగౌడ్, సంగమేష్, రవి, వెంకట్, కృష్ణ, రమణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రఘునాథ్‌యాదవ్



గచ్చిబౌలి: సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్‌యాదవ్ కలిశారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీజీఈడబ్ల్యూడీసీ మువ్వ విజయ్‌బాబు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లా వెంకట్‌రావుతో కలిసి రఘునాథ్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శాలువా కప్పి సన్మానించారు.

యాక్సిస్ బ్యాంక్ 19వ శాఖ ప్రారంభం

గచ్చిబౌలి: యాక్సిస్ బ్యాంక్ 19వ శాఖను గచ్చిబౌలిలోని శిల్పావ్యాలీ రోడ్‌లో గురువారం శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతి యాదవ్ ప్రార ంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి క్లస్టర్‌లో ఓ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ శివప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ మాధవి, శ్రీనివాస్, స్థానికులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నేడు పశుపోషణపై సదస్సు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండల ఆధ్వర్యంలో నేడు సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతి అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక విస్తరణ విభాగం అధికారి సత్యనారాయణ తెలిపారు. సుస్థిర పశు ఉత్పాదకతపై వివిధ అంశాలపై లోతైన పరిశోధన, మేధోమదనం , ఉత్పాదకత పశు సంక్షేమం అనే అంశాలపై చర్చ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

'ఎస్కీ'లో ప్రత్యేక శిక్షణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, బిగ్‌డేటా ఎనలిటిక్స్, ఏఐపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాండిచ్చేరి యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బ్యాంకింగ్ టెక్నాలజీతో కలిసి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మిరాకిల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నిపుణుడు మధు వడ్లమాని, బ్లాక్ చెయిన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఉపాధ్యక్షుడు అశ్వక్‌షేక్ పాల్గొని బ్యాంకింగ్ టెక్నాలజీ డిమాండ్‌మెంట్ చివరి ఏడాది విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీ అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడం ద్వారా పరిశ్రమ, విశ్వవిద్యాలయాల మధ్య అంతరాన్ని తగ్గించడం, నైపుణ్య ఆధారిత శిక్షణపై చర్చించారు.

పక్షుల కోసం మట్టి పాత్రలను సిద్ధం చేసిన టీఎస్ఎఫ్‌డీసీ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



పక్షుల దాహం తీరేలా..



గచ్చిబౌలి: వేసవిలో పక్షుల కోసం బొటానికల్ గార్డెన్‌లో నీటి పాత్రలను ఏర్పాటు చేశారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ మట్టి పాత్రలను అందజేశారు. దాదాపు 200 పాత్రలను గార్డెన్‌లో పలు ప్రాంతాలలో అమర్చారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, జీఎం డాక్టర్ సైకిలాబ్ , రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ,డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్, బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసాసియేషన్ అధ్యక్షులు భరత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ పడితే.. అక్కడ..

ఇష్టారీతిన వాహనాల పార్కింగ్

- తప్పని ట్రాఫిక్ కష్టాలు
- సెల్లార్లలో దుకాణాల నిర్వహణ
- రోడ్లపైనే వాహనాలు



చందానగర్ మంజీరా పైప్‌లైన్ రోడ్డులో దుకాణాల ముందు రోడ్డుపైన నిలిపిన వాహనాలు

హఫీజ్‌పేట్: చందానగర్ జాతీయ రహదారి, మంజీరా పైప్‌లైన్ రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. ఒక వైపు ఫ్లైఓవర్ నిర్మాణం, మరోపక్క మంచినీటి పైప్‌లైన్ పనులు..ఇక షాపింగ్, ఆస్పత్రులకు వచ్చే ద్విచక్ర వాహనాలతో పాటు కార్లను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చలాన్లు విధించి, రోడ్లపై నిలిపిన వాహనాలను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినా వాహనదారులలో మార్పు రావడం లేదు. రోడ్లపై నిలుపవద్దంటూ అవగాహన కల్పించినా పట్టించుకోవడం లేదు. ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా నడుస్తున్న నేపథ్యంలో వాహనదారులు ఏకంగా జాతీయ రహదారిపై వదిలేసి వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. పనుల్లో ఆలస్యం .. దీనికితోడు రోడ్డు విస్తరణ, అక్రమ పార్కింగ్ వల్ల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

- ఉదయం, సాయంత్రం వేళ వాహనాల రద్దీతో ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతం.
- లింగంపల్లి బీఆర్ఎస్ గ్యాస్ కంపెనీ నుంచి కడిమి ఆస్పత్రి వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఇష్టానుసారంగా రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు.
- ముంబై జాతీయ రహదారి విస్తరిస్తున్న సందర్భంగా సమీపంలోని ఆసుపత్రికి వచ్చే కార్లు జాతీయ రహదారిపై నిలుపుతుండడంతో సమస్య తీవ్రమైంది.
- చందానగర్– లింగంపల్లి నాలా పనులు కొంత పెండింగ్‌లో ఉన్నాయి.
- వ్యాపార సముదాయాల సెల్లార్లు వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేస్తే వాటిని చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు.
- సర్వీస్ రోడ్డుపైనే వాహనాలు నిలపడం వలన తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నా సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- మంజీరా రోడ్డులో ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలుపడం వల్ల ఒక కారు వచ్చిందంటే మరో కారు వెళ్ళడానికి వీలుకావడం లేదు.
- దుకాణాలకు వచ్చేవారి వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలతో పాటు సెల్లార్లను కేటాయించాలి.
- కాగా జీహెచ్ఎంసీ అధికారులు సెల్లార్‌లో ఉన్న దుకాణాలు కూల్చివేసినప్పటికి తిరిగి ఏర్పాటు చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





చందానగర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలుపడంతో ఇరుకుగా మారిన రోడ్డు

చల్లాన్లు వేసి.. సీజ్ చేస్తున్నాం



చందానగర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలకు వచ్చే వారు రోడ్లపైనే వాహనాలు ఆపుతున్నారు. వీరికి నో పార్కింగ్ చలాన్లు వేస్తున్నాం. వాహనాలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించాం.అయినా వాహనదారుల తీరు మారడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు వ్యాపారుల సముదాయాల సెల్లార్లపై చర్యలు తీసుకోవాలి.

- పవన్‌కుమార్, ట్రాఫిక్ సీఐ, ఆర్సీపురం

సెల్లార్‌లు ఖాళీ చేయించాలి



మంజీరా పైప్‌లైన్ రోడ్డు, జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యాపార సముదాయాల సెల్లార్లలో దుకాణాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. కొంతమంది దుకాణదారులు ఇష్టానుసారంగా చిన్న దుకాణాలకు అద్దెకు ఇచ్చి పార్కింగ్ లేకుండా చేస్తున్నారు. ఇప్పటికైన జీఎంహెచ్‌సీ అధికారులు స్పందించాలి.

- శంకర్, చందానగర్

కొనసాగుతున్న నాగ ప్రతిష్ఠ ఉత్సవాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవతా సహిత నాగ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నిత్య పూజ, రుద్రహవనం, మూలమంత్ర హోమం తదితర పూజలు చేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, ధ్యాన, ఫల, పుష్ప, శయ్యాదివాసం, రాజోపచార పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీ సాయి అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి జన్మ దినోత్సవం ఉత్తర నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రధాన పూజారి విష్ణుదాస్ నంబూద్రి సమక్షంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 5.30 గంటలకు సర్వదేవతా అభిషేకం, గణపతి పూజ, కలశ పూజ, కలశాభిషేకం, అలంకార దర్శనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 7 గంటలకు పల్లకి సేవ, పడిపూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాగాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూ సాగాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చింతకింది కాశీం అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో గురువారం ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో విశ్వభారతి లా కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు యువతీ, యువకులు ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో లా కళాశాల అధ్యాపకులు వర్ష, రమ్య, కీర్తి, అన్వి, పూనం, తేజశ్రీ ,గురుమూర్తి, అంబర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి



జలమండలి కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జీఎం రాజశేఖర్, రామస్వామి యాదవ్

హఫీజ్‌పేట్ : భూగర్భ జలం పెంపునకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నీటి యొక్క ప్రాముఖ్యత, నీటి వృథా, నీరు కలుషితమవకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గురువారం హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాజశేఖర్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక నినాదంతో ఈ పండగను నిర్వహించుకుంటున్నామని ఈ సంవత్సరం శాంతి కోసం నీరు అనే నినాదంతో వెళ్తున్నామన్నారు. భూమిపై తాగేందుకు ఉపయోగపడే నీరు కేవలం 1 శాతం మాత్రమేనని, అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదులలో, మిగితా 0.12 శాతం భూగర్భ జలాలు ఉన్నాయన్నారు. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు అవసరమని, జీవ వైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే పలుచోట్ల నీటిని వృథాగా నేలపాలు చేస్తున్నామన్నారు. అనంతరం ఇంకుడు గుంతలు ఏర్పాటుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెకర్ మారబోయిన సదానంద్ యాదవ్, సభ్యులు పాలం శ్రీను, వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రావు, జీవీరావు, జిల్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

796 లీటర్ల మద్యం పట్టివేత

కుత్బుల్లాపూర్: పోలీసులు బెల్టుషాపులపై మెరుపు దాడులు చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్ఓటీ బృందాలు 8 పోలీస్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 796 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.7,47,368 ఉంటుందని పోలీసులు తెలిపారు. అత్యధికంగా పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా వలపన్ని 480 లీటర్ల మద్యాన్ని మేడ్చల్ టీమ్ పట్టుకుంది. అదే విధంగా మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో 45.2, రాజేంద్రనగర్‌లో 94.78, శామీర్‌పేట్‌లో 11.25, బాచుపల్లిలో 55.8, మైలార్‌దేవ్‌పల్లిలో 17.4, నందిగామలో 19.14, దుండిగల్‌లో 6.43 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

క్షేత్రస్థాయిలో పంటల సందర్శన



కూరగాయల తోటలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులు



యూనివర్సిటీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

ఏజీవర్సిటీ: జాతీయ సేవా పథకంలో భాగంగా నాల్గోరోజు శంషాబాద్ మండల పరిధి మల్కారంలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులతో కలిసి పూలు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతులు పండిస్తున్న కూరగాయలు, బెండ, టమాటా, గోరు చిక్కుడు, పాలకూర, మెంతికూర, పూదీనా, కొత్తిమీర, క్యాబేజీలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అనుసరించాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి కూరగాయల విభాగపు శాస్త్రవేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ కే నిరోషా రైతులకు తగిన సూచనలు చేశారు. ప్రధానంగా కూరగాయ పంటల్లో వచ్చే నూతన వంగడాలను ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడిని పొందగలరన్నారు. కీటకాల్లో కూడా మిత్ర, శత్రు కీటకాలు ఉంటాయని వాటికి అనుగుణంగా ఎరువులను తగిన మోతాదులో వాడాలని వివరించారు. ముఖ్యంగా అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారులు సీఎస్ఆర్ సంతోషిని, లావణ్య, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జాతీయ సేవా పథకంలో భాగంగా కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతు రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఒక యూనిట్ రక్తంతో దాదాపు ఆరుగురి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.18 సంవత్సరాలు నుంచి 0 సంవత్సరాల లోపు ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి సిబ్బంది రక్త నిధిని సేకరించారు.

శంషాబాద్ బస్‌స్టేషన్‌ను ఆధునీకరించాలని వినతి

శంషాబాద్: అంతర్జాతీయంగా పేరు గాంచిన శంషాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆధునీకరించాలని కాంగ్రెస్ నేతలు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. ఈ మేరకు పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్‌లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్‌స్టేషన్ సమస్యలను వివరించడంతో పాటు జాతీయ రహదారిపై బస్సుల కోసం ప్రయాణికులు మండుటెండల్లో, వర్షాల్లో నిలబడాల్సిన దుస్థితి ఉందన్నారు. దీనిపై గత పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శంషాబాద్‌లో బస్ టెర్మినల్ ఏర్పాటుకు ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.



మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నేతలు నరేందర్, సంజయ్‌యాదవ్

కార్ల దొంగతనం కేసులో ఐదుగురు రిమాండ్

మియాపూర్ : జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో క్యాబ్‌లను అద్దెకు తీసుకుని డ్రైవర్లపై దాడి చేసి డబ్బు, కార్లు ఎత్తుకెళుతున్న ఐదుగురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా గోకరాజుపాలెం గ్రామానికి చెందిన బాలగాని నాంచారయ్య(35), కంచాలవారిపాలెంకు చెందిన పిట్టు నాగిరెడ్డి(30), బాపట్ల జిల్లా హార్బర్ రోడ్డు పదహారు ఇళ్ల కాలనీకి చెందిన సింగోటి శివనాగరాజు(21) కారు డ్రైవర్లు. వీరు ముగ్గురు కలిసి హైదరాబాద్ నగరానికి వచ్చారు. మియాపూర్ నుండి శంషాబాద్ వెళ్లేందుకు మెహిదీపట్నంకు చెందిన బొంతే విజయ్ క్యాబ్‌ను రూ.2500లకు అద్దెకు మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద విజయ్‌కుమార్ క్యాబ్‌లో నాగిరెడ్డి, శివనాగరాజు, నాంచారయ్య శంషాబాద్‌కు బయల్దేరారు. వీరితో పాటు బాపట్ల జిల్లా రామరాజుగడ్డకు చెందిన కేతన శివ, కృష్ణాజిల్లాకు చెందిన బోడి సుబ్బరాజు(26) మరో కారులో విజయ్‌కుమార్ కారు వెంబడి బయల్దేరారు. ముందుగానే అనుకున్న పథకం ప్రకారం... శంషాబాద్ సమీపంలోకి రాగానే ఎవరూలేని ప్రాంతం చూసి కారును నిలిపివేశారు. కారు డ్రైవర్ విజయ్‌కుమార్‌పై దాడి చేసి టవల్‌తో నోరు, చేతులు కట్టి కారులో పడేశారు. నాగిరెడ్డి, నాంచారయ్య, శివనాగరాజు, మరో కారులో కేతన శివ, సుబ్బరాజులు బయల్దేరారు. డ్రైవర్ విజయ్‌కుమార్‌ను అతని కారులోనే తీసుకువెళ్లి నగరంలోని చౌటుప్పల్ మల్కాపూర్ వద్ద పాడుబడ్డ ఇంటిలో పడేసి అతని వద్దనుండి రూ.2500లు, సెల్‌ఫోన్, కారు తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం డ్రైవర్ విజయ్‌కుమార్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో 14వ తేదీ కారును దొంగిలించుకుని వెళ్లారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం రాత్రి మియాపూర్ పోలీసులు బొల్లారం ఎక్స్ రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా అటువైపుగా కారులో వచ్చిన నాంచారయ్య, నాగిరెడ్డి, శివనాగరాజు, శివ, సుబ్బరాజులను అనుమానించి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా కారు దొంగతనం చేసినట్టు అంగీకరించారు. దొంగిలించిన కార్లను గుంటూరు జిల్లా రాంబొట్లపాలెంకు చెందిన జూపూడి భూపేశ్వర్‌రావు వద్ద కుదువపెట్టేవారు. కారు పేపర్లు మరుసటి రోజు తెస్తానని చెప్పి డబ్బులు తీసుకుని జల్సాలు చేసేవారని తెలిపారు.

- బాలగాని నాంచారయ్య, పిట్టు నాగిరెడ్డి, శివనాగరాజు ,శివలు బాపట్ల జిల్లా పరిధిలో హత్యకేసులో నిందితులుగా ఉండి జైలుకు వెళ్లి వచ్చారని పోలీసులు తెలిపారు.
- ఈ మేరకు పోలీసులు ఐదుగురు నిందితుల నుండి రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ వర్క్‌షాప్



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో గురువారం కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కాపింగ్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య పథకం అమలు, ఆడిట్‌పై చర్చించారు. యూఎస్ఏ, బెల్జియంతో పాటు భారతదేశానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులతో సహా జాతీయ అంతర్జాతీయ నిపుణులు పాల్గొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులున్నారు.

కొత్త మేయర్‌గా లతాప్రేమ్‌కుమార్‌గౌడ్..!

72 రోజుల హైడ్రామాకు తెర



అవిశ్వాసం నెగ్గిన కార్పొరేటర్లను సన్మానించిన ప్రజలు

బండ్లగూడ/మణికొండ: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం జరిగిన సమావేశంలో మేయర్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కొత్త మేయర్ ఎవరనే చర్చ ప్రారంభమైంది. మేయర్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో అదే కోటాలోని కార్పొరేటర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. గతం నుంచి కొత్త మేయర్‌గా లతాప్రేమ్‌కుమార్‌గౌడ్‌ను ఎన్నుకునేందుకే కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నట్లు డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ సమావేశ తేదీని నిర్ణయించడమే ఆలస్యమని ఆమెను మేయర్‌గా ఎన్నుకుంటామని పలువురు కార్పొరేటర్లు గురువారం స్పష్టం చేశారు. దీంతో కార్పొరేషన్‌కు మొదటి మహిళా మేయర్‌గా ఆమెకు అవకాశం దక్కనుంది.

నెగ్గించుకున్న పంతం..

మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌ను పదవి నుంచి తప్పించేందుకు ఒక్కటైన 16మంది కార్పొరేటర్లు ఎట్టకేలకు తమ పంతం నెగ్గించుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో జనవరి 12 నుంచి మొదలైన అవిశ్వాసం హైడ్రామా ఎట్టకేలకు 72 రోజులకు తెరపడింది. హైకోర్టు ఆదేశాలతో వాయిదా పడటంతో స్థానికంగానే అదే పట్టుదలతో ఉండి గురువారం జరిగిన సమావేశంలో తమ ఐక్యతను చాటుకోవటంతో పాటు మహేందర్‌గౌడ్‌ను పదవి నుంచి తప్పించగలిగారు.

ఒంటెద్దు పోకడతోనే...

సమిష్టి నిర్ణయాలు తీసుకోకుండా ఒంటెద్దు పోకడతోనే పదవికి ముప్పు వచ్చిందనే చర్చ కార్పొరేషన్ పరిధిలో సర్వత్రా వినిపిస్తుంది. ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకుని వాటిని తీర్చేందుకు అవసరమైన నిధుల కేటాయింపు, తీర్మానాలు చేయకుండా తన స్వలాభాన్ని చూసుకున్నారనే విమర్శలున్నాయి.

పట్టులేకపోవడం..

పాలనపై ఎలాంటి పట్టు లేకపోవటం, తనకు నచ్చిందే చేయాలని కార్పొరేటర్లతో పాటు అధికారులపై ఒత్తిడి చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆర్థిక లావాదేవీల్లోనూ.. కార్పొరేటర్లతో చర్చించకపోవడం కూడా కారణమనే చర్చ ఉంది. కార్పొరేటర్లలతో పాటు గతంలో పనిచేసిన అధికారులను సైతం చిన్నచూపు చూడటంతో పాటు వారిని ఎమ్మెల్యే సహకారంతో బదిలీ చేయించారనే ఆరోపణలున్నాయి.

పార్టీ మారినా దక్కని ఫలితం...

బీఆర్ఎస్ పార్టీ తరపున కార్పొరేటర్‌గా గెలిచి బండ్లగూడ కార్పొరేషన్‌కు మేయర్‌గా ఎన్నికైన మహేందర్‌గౌడ్ ఇటీవల తనకు మద్దతుగా ఉన్న 5 మంది కార్పొరేటర్లతో ఇటీవల ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పనిచేయని ముందస్తు వ్యూహం..

మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌కు వ్యతిరేకంగా ఉన్న 16 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ముందుగా తాను చేరితే పార్టీ పెద్దలు అవిశ్వాసాన్ని ఎలాగైనా తప్పిస్తారని ఎత్తుగడతో పనిచేశారు. పదవి నుంచి దించటమే తమ ఏకైక ధ్యేయంగా ఉన్న వ్యతిరేక కార్పొరేటర్లు ఆ విషయాలను పట్టించుకోకుండా తమ పంతం నెగ్గించుకున్నారు.